


'మోహిని లాంటిది దిగివచ్చి అమృతం పంచిపెడుతున్నప్పుడు నేను రాక్షసుల వరసలోనే కూచుంటాను. రుచీపచీ లేని ఆ అమృతపు చుక్కలు వెర్రిదేవతల చేతుల్లో పోసి కంటి కటాక్షామృతాన్ని రాక్షసులకి ప్రసాదించి కరకు గుండెల్లో కలకలనాదం పలికించింది. ఆ సమ్మోహనాస్త్రం చవి చూశాక యిక చచ్చిపోతే మాత్రం ఏం కొరత!'

ఈ మాటలు అన్నది మా పెద్ద మేనమామ మురళీధరరావు. 'రాజారాం కట్టుకున్న పెళ్లాన్ని వదిలిపెట్టి కృష్ణతో ఉంటున్నాడని లోకమంతా దుమ్మెత్తిపోస్తోంది. నాకు మాత్రం అందులో ఏం తప్పు కనిపించలేదు. రసపిపాస ఉన్న మొగాడెవడైనా సరే కృష్ణలాంటి దాన్ని చూసిన తరువాత లోకాన్నంతటినీ విడిచిపెట్టి అయినా ఆ అమ్మాయి వెంట పడతాడు! అవును మరి. అంత సౌందర్యం ఆ దెవరికి అందుబాటులో

# ఏకపత్నీవ్రతుడి కథ

## అవసరాల రామకృష్ణారావు



ఉంటుందో గాని బాహ్య సౌందర్యానికే ప్రపంచ మంతా పడిచస్తుంది. పై పైకి చక్కగా కనబడేవాటిలోనే భగవంతు డనేవాడిని కనుక్కోడానికి ప్రయత్నిస్తాం. లావుగా ఉన్నవాళ్లూ, నల్లగా ఉన్న వాళ్లూ పొట్టిగా ఉన్నవాళ్ళూ వికారమైన ముఖ లక్షణాలు ఉన్నవాళ్ళూ అలా ఉన్నా మని విచారించని క్షణం ఉండదు. నిజాన్ని ఒప్పుకుని ఆ విధంగానైనా ఒక మంచి పని చెయ్యడం మంచిది। తలలో నాలిక లాంటి భార్య ఎవడి క్కావాలి ? వెర్రి మాట, అందాల అందొ౹ిక కావాలిగాని.'

ఇలాంటి మాటలు అంటున్నప్పుడు తెల్లబోయి మామయ్య వైపు చూసే వాళ్ళం. ఆ మొహంలో కనిపిస్తున్నది వర్చస్సో లేక రక్షస్సో అది మాత్రం బోధపడేది కాదు. పుట్టుకతో వచ్చిన పూర్ణచంద్రుడిలాంటి స్వరూపం, పడుచుతనంతో వచ్చిన చక్కదనం విద్య కోసం విదేశం వెళ్ళిరావడంతో వచ్చిన విజ్ఞానం ఇన్నీ కలిసి కన్య లందరికీ కడుప్రియమై పోయాడు మామయ్య. జడలు ఎత్తికట్టి, మెడలు ఎత్తిపెట్టి 'ఇదిగో అబ్బాయీ, ఆ మూడు ముళ్ళూ నా మెడలో వెయ్యవూ?' అని వగలు కురిపిస్తున్న వయ్యారుల వరసలో అఖరున తల వంచుకు నిలబడిన శకుంతలకి ఆ అదృష్టం పడుతుందని కలలోకూడా ఎవరూ అనుకొని ఉండరు.

'ఏదో పెద్ద కష్టపడిపోయిందని ఆ సీతమ్మకు అందరూ సానుభూతి చూపిస్తారు, కాదనలేము. కాని రాముడు ఒక్క ఆడదాన్ని నమ్ముకుని పడిన సుఖ మేమిటని? సీతమ్మను తన దగ్గర ఉంచినా అడవిలోకి పంపినా రాముడది చేసింది ప్రజలకోసమే. ఆయన అంతర్గత సంచలనాలూ అవీ ఎవరికి తెలుసు! ఒక్క లేడిని చూస్తేనే సీతమ్మ కన్ను చెదిరింది. పందలాది లేళ్ళలాంటి ముద్దుగైన ముని కన్యల్ని చూసి రఘురాముడి మన స్సెంత చెదిరిందో ఎవరు సాక్ష్యం? అందుకనే రాముడు 'తిరుగుటపా'లో కృష్ణుడి అవతారం దాల్చే డని నా నమ్మకం. పదహారు వేలమందితో వేగిన సంగతలా ఉంచి ఎనమండుగురు భార్య లనైనా అందరూ ఒప్పుకుంటారు గదా! ఎనిమిది ఏమంత చిన్న సంఖ్య కాదుగదా! ఒక్కొక్కరికి పందచొప్పున ఒక చిన్న గ్రామం జనాభాను మించిన పిల్లల్ని కనిన చిన్ని కిష్టమ్మ అల్లరిపనులు కాదనలేం గదా!' అని నోటి కొచ్చినట్టు విమర్శించి, కడుపు నొప్పి పెట్టేదాకా నవ్వించే మా మామయ్య సర్వసాధారణంగా ఉండే శకుంతలను పెద్దలు చెప్పినట్టు విని పెళ్ళాడ్డం విశేషం. హాయిగా కాపురం చెయ్యడం విచిత్రం. విరివిగా పిల్లల్ని కనడం విపరీతం!

'వారికి నేను ఏ విధంగానూ తగను. అయినా ఆయన పరాయి ఆడదాన్ని కన్నెత్తి చూడరు—అదెంత అదృష్టమో నాది!' అని మా శకుంతలత్త వాళ్ళ పెళ్ళయిన మొదటి అయిదు సంవత్సరాల్లో అనడంలో కొంతయినా అర్థం ఉంది. వరసగా పిల్లల్ని కనడంతో శరీరం ఒడిలిపోయి సడలిపోయి నలభై ఏళ్ళకే అవ్వలా తయారయిన మా పెద్దత్త మళ్ళీ అదే మాటంటే అందులో ఏమైనా అర్థం ఉందొద్దూ?

చెప్పొచ్చే దేమిటంటే ఒక యింటర్వ్యూ సందర్భంలో నేను న్యూఢిల్లీ వెళ్ళవలసి వచ్చి వాళ్ళింటికి వెళ్ళి శకుంతలత్తని కలుసుకోడం జరిగింది. ఆమె నోట అదే మాట విని నాకు ఆశ్చ

శ్చర్యం కలిగింది. క్రిందటేడు ఒకరి పెళ్ళిలో చూసిన దానికే సహస్రాంతం తేడా కనిపించింది. ఆమెలో తల మూడొంతులు పండిపోయింది. దవడలు గుంటలు పడ్డాయి. కళ్ళు లోతుకు పోయాయి. ఈ మధ్య యూట్రెస్ ఆపరేషను చేసి తీసెయ్యవలసి వచ్చిందిట. బతుకుతుందని ఎవరూ అనుకో లేదుట. ఇక మామయ్యని చూడబోతే ఆమెకు ఏ తమ్ముడిలాగో కొడుకులాగో ఉన్నాడు గాని మొగుడిలా మాత్రం లేడు. రోజు రోజుకీ ఆ గుండ్రని బుగ్గలకి నునుపూ మెరుపూ ఎక్కువవుతోంది. తిండి విషయంలో రోజుకి ఒక పెరుగు గారీ, క్రికెట్ ఆటలో రోజుకి ఒక పరుగు చొప్పు నెక్కువవుతున్నాయి గాని తగ్గడం లేదు. ఇక ఆ న్యూఢిల్లీపట్టణంలో సహా 'కె యం. రావు' అంటే ఎరగనివా రుండరు. అంతటి కలుపుగోలు మనిషి. రెండు వేలు జీతం, రెండంతస్థుల మేడలో ఆరుగదుల అతి సదుపాయమైన వాటాలో కాపురం. కాన్వెంటులోనూ కిండర్‌గార్డెన్ స్కూళ్ళలోనూ చదువుకుంటున్న ఇద్దరు ఆడపిల్లలూ ఇద్దరు మొగ పిల్లలూ. వీళ్ళని చూడ్డానికి ఒక ఆయా. ఆమె కాక ఒక నౌకరూ, ఎప్పుడూ యింట్లో ఉండిపోయే ఒక వంటక్కా. ఒక కారూ, ఒక కుక్కగారూ...

అన్నీ బాగానే ఉన్నాయి. రూపాయిలు గలగల్లాడుతున్నాయి. పిల్లల మొహాలు కళకళ్లాడుతున్నాయి. తండ్రి ఎప్పట్లా మిసమిస లాడుతూ ఉన్నాడు. మరేమిటి ఆయింటికి వెలితి? ఏమీలేదు. నాదే పొరపాటు, మా శకుంతలత్త చిన్న కళ్ళుకూడా మిలమిల మెరుస్తున్నాయి!

'మనదేశంలోని ఏ ప్రాంతాల విద్యార్థులకైనా సరే ఒకేఒక సామాన్యధర్మం ఉంది. అదేమిటంటే పరీక్షల్లో కాపీ కొట్టడం. ఒక్కసారి వాచరుగాని బయటికి వెడతాడా పక్కవాడి పేపర్లో ఒక్కసారి తొంగిచూసి వచ్చేద్దామా అనుకోని విద్యార్థి సర్వసాధారణంగా ఉండడు. ప్రపంచంలోని ఏ ప్రాంతాల యువకుల మనస్తత్వమైనా ఇంతేనని నా ఉద్దేశం. ఎప్పుడు ఎదురింటివాడు బజారుకెడతాడా, ఎప్పుడు అతని పెళ్ళాన్ని ఒక్కసారి ముద్దులాడి వచ్చేద్దామా అని ఉరకలు వెయ్యని యువకప్రాణి ఉండదు!'

'రామ, రామ! అందరూ అలాగే ఉంటారా? అంత అన్యాయం ఉంటుందా?' అన్నాను నేను ఓసారి మామయ్య మరీ చెబుతూంటే విని ఊరుకోలేక. ఆయన ఫక్కున నవ్వేశాడు.

అలా అంటూనే 'నువ్వు నీకిష్టమైన ఏ అమ్మాయినో అప్రయత్నంగా రెండు సార్లు తలుచుకున్నావు. 'రామ' అంటే అందమైన ఆడది అని నీకు తెలీదా? ఆ గోలకొండ జైల్లో కూచుని కొండంత గోలచేసిన గోపన్నగారు పూర్తిగా 'రామ' దాసు అయిపోలేదా? అంతా 'రామ'

మయం అని అనుక్షణం ఆక్రోశించ లేదా ?'

ఈసారి నేను నవ్వుకున్నాను. ఇంతటి పెద్దమనిషి యిటువంటి బుద్ధిమంతుడూ అవసత్వా లుడిగి జవజవ లాడుతున్న భార్యతో కులాసాగా కాలక్షేపం ఎలా చేస్తున్నాడూ అన్నదే జవాబు లేని ప్రశ్న.

నేను వెళ్ళేసరికి మామయ్య యింట్లో లేడు. పిల్లలు యింకా స్కూళ్ళనుండి రాలేదు. అత్తయ్యే నన్ను ఆదరించి అన్నం పెట్టింది. అందరి గురించీ భోగట్టాలు చేసింది.

'నీ ఒంట్లో ఇప్పు డెలా ఉంది శకుంతలత్తా ?'

అత్తయ్య అదోలా నవ్వింది.

'బాగానే ఉన్నాను బాబూ ! అసలు ఎప్పుడో చచ్చిపోవలసినదాన్ని. ఆయన చూపించే ప్రత్యేక శ్రద్ధా, ఆదరాభిమానాలూ నన్నింకా బతికించాయి. వాటి కోసమే బతుకుతున్నాను!' ఆమె కన్నీళ్ళు కార్చింది. 'అలా నిస్పృహ చెందుతావెందుకత్తా; ఇప్పుడు నీ కేమయిందనీ?'

'నిస్పృహ కాదు బాబూ: ఇవి పొంగి పొర్లిన ప్రేమ భాష్పాలు! ఆయనకి నేను ఎటువంటి సుఖమూ ఇవ్వలేను. అయినా నన్ను సుఖపెడదామని ప్రతి క్షణం మీ మామయ్య ప్రయత్నిస్తాడు. ఎంత పీకలమునిగిపోయే పని ఉన్నా సాయంకాల మయేసరికల్లా పరిగెత్తుకు వచ్చేస్తారు. తన కిష్టమైన బట్టలు కట్టుకుని చక్కగా ముస్తాబవమని బలవంత పెడతారు. నన్ను యీ యింటిముందున్న పేవ్‌మెంటు మీద అలా ఫర్లాంగు దూరం ఆ కబురూ ఈ కబురూ చెబుతూ చల్లగాలిలో నడిపించుకు వస్తేగాని ఆయనకి తోచదు. ఈ వయసులో నన్ను రెండు జడలు వేసుకోమంటారు. ఇంతటి పొడగైనదాన్ని నన్ను ఏ పంజాబీ డ్రెస్సో వేసుకోమంటారు. ఊళ్ళోకి ఏ తెలుగు సినిమా నూటికొకనాడు వచ్చినా, ఆంధ్రా ఎసోసియేషన్ వాళ్ళు ఏ నాటకం వేసినా దానికి నన్ను తీసికెళ్ళి అది నాకు చూపించేదాకా ఆయనకి తోచదు. ఇక నా జబ్బు కుదర్చడానికి ఎన్ని రకాల స్పెషలిస్టులకి చూపిస్తున్నారో ఎన్ని వేలు ఖర్చు పెడుతున్నారో దానికి లెఖ్ఖా జమా లేదు. కల్పతరువుక్రింద నున్న గచ్చపొదని నేను. అదృష్టవంతురాల్నో దురదృష్టవంతురాల్నో అది మాత్రం పోల్చుకోలేకుండా ఉన్నాను వేణూ !'

'అదేమిటి శకుంతలత్తా, ఇందులో దురదృష్ట మేముందీ ?'

'మే మిద్దరం అలా షికారుకి పక్కపక్కని నడుస్తూ వెడుతున్నప్పుడు మమ్మల్నిద్దర్నీ పోల్చి చూసి జనం ఎంతలా విరగబడి నవ్వుతారో నేను ఊహించగలను. కాని ఏ మాత్రం బెదురు చెదరకుండా ఎప్పట్లా నా కళ్ళల్లోకి ఆయన తియ్యగా ఎలా చూడగలుగుతున్నారో




"ఒక కోటి మైసూర్‌పాక్ కావాలా! టీ పార్టీ చేస్తున్నారా?"
"అబ్బే! — ఇటుక అమ్మే వెలకు మీ స్వీట్సుతోనే ఇల్లు కట్టేద్దా మనుకుంటున్నా!"

అదే నాకు అర్థం కాదు. నాకు వేరే అద్దం అక్కర్లేదు. పక్కనున్న దివ్యమంగళ స్వరూపాన్ని ఒక్కసారి చూచుకుంటేనే నా తక్కువతనం నాకు అర్థమౌతుంది. అది నా చేతుల్లో లేదని తెలుసు. కాని విచారించకుండా ఉండలేను. ఏ విధంగానూ ఆయనకి తగినదాన్ని కాను. అంతకన్న దురదృష్టమేముంది!'

మొదట్నుంచీ నేనంటే శకుంతలత్తకి చనువూ అభిమానమూ. అందుకే ననుకుంటాను మరికొన్ని విషయాలు చెప్పింది.

'ఇంట్లో సౌందర్య సంశోభితలూ, సర్వాంగ సంపూర్ణలూ అయిన భార్యలని ఉంచుకుని పరదారల పరదాలను తొలగించడమే పరమావధిగా భావించే సరదా పురుషులు ఉన్న లోకంలో రోగిష్టిదానితోనే సంతుష్టిపడి పరాయి పిల్లను చెల్లాయిగా చూసుకునే మీ మామయ్యలాంటి వాళ్ళు ఎంతమంది ఉంటారంటావు వేణూ!'

నేను వింటూ కూచున్నాను. జవాబు చెప్పలేదు. చెప్పలేనుకూడా. ఒకమనిషి కేరెక్టరు సరి అయినదా కాదా అనేది ప్రపంచంలో అన్నిటికన్న కష్టమైన ప్రశ్న. అందులో ఎట్టని చుక్కా, ఎట్టిగా బుట్టిగా ఉన్న చక్కని చుక్కా లేవిదే నిద్రపోలే రని ప్రసిద్ధి చెందిన ఐశ్వర్య

వంతుల కుటుంబంలో పుట్టి పెరుగుతున్న పెన్నతప్ప మరొక విషయం మాటాడని మా పెద్దమామయ్యమడిగట్టుకు కూచున్నాడంటే ఎవరు నమ్ముతారు ? నమ్మకపోవానికి అలా చెబుతున్నది మరొకరూ మరొకరూ కాదు. కట్టుకున్న యిల్లాలు ఆమెను. నమ్మక ఏంజేస్తారు ? అయినా ఇప్పటికికూడా మన సాంఘిక వ్యవస్థలో పురుషుల వ్యభిచారం చెప్పుకోదగ్గ అపచారం కాదే. ఏమయితేనేం దానికి జవాబు ఆరాత్రే నా కళ్ళబడడం అదొక చిత్రమైన విషయం.

అవాళరాత్రి పదకొండు అయిఉంటుంది 'రెక్కాడితే గాని డొక్కాడదు' అన్న పేదవాళ్ళ సామెత అయితే 'ఫేను రెక్కాడితే గాని ప్రాణం నిలబడదు' అన్నది గొప్పవాళ్ళ సామెతేమో ! ఫేన అది తిరుగుతూనే ఉంది. నా బుర్రలో వీళ్ళ సంసారం గురించి అంతుపట్టని ఆలోచన అలా గిరగిరా తిరుగుతూ నిద్ర పట్టనిచ్చింది కాదు కింద ఏవో కిలకిలా నవ్వులు వినిపించి కిటికీ తలుపు ఓరగా తీసి కిందికి చూశాను. ఆ దృశ్యం చూసి అలా నిర్ఘాంత పోయాను. నైట్ క్వీన్ పొదపక్కని ఆ వెన్నెల వెలుగులో మా మామయ్యా మరొక మందగమనా స్పష్టంగా కనిపిస్తున్నారు. ఎర్రనిబోర్డరు గల పసుపుపచ్చ గళ్ళ చీర కట్టుకుంది ఆమె. అదేరంగు స్లీవ్‌లెస్ జాకెటు బలంగా పొడుగ్గా సన్నగా ఉన్న ఆమె మామయ్యను దిగబెట్టడానికి వచ్చినట్టుంది. వాళ్ళిద్దరూ అతి నెమ్మదిగా మాటాడుకున్నా రాత్రివేళ కావడంచేత స్పష్టంగా వినిపిస్తోంది. కాని అదేం భాషో నాకు ఒక్కముక్క అర్థంకాలేదు. కళ్ళతోచూసి తెలుసుకో గలిగింది. అంతకన్న నాకు తెలియవలసిందీ లేదు వెళ్ళేముందు, ఆమెను మరోమారు—అటూ యిటూ చూసి గాఢంగా కావలించుకుని గట్టిగా ముద్దెట్టుకుంటుంటే మా మామయ్య — నేనే చూడలేక తలుపు మూసెయ్యబోయి అప్రయత్నంగా ఎదుటిగది కిటికీలోకి చూశాను. ఆ కిటికీలో మా శకుంతలత్త ఆకారం స్పష్టంగా కనిపించింది. అయితే ఆ తరువాత నడిచిన కథ అంతకన్న చిత్రమైనది.

పెద్దచప్పుడు చేసుకుంటూ మామయ్య మేడమీదకు వచ్చాడు. వాళ్ళ గదిలో మాటలు స్పష్టంగానే వినిపించెయి.

'వేణుగోపాల్ గాడు పడుకున్నట్టున్నాడు కదూ ?'

'ఊఁ'

"నువ్వేం శకూ యింకా మేలుకుని ఉన్నావ్ ?"

"లేదండి. ఎప్పుడో నిద్రపట్టేసింది. మీ జోళ్ళచప్పుడు విని మెలకువ వచ్చేసింది. ఆ బట్టలు త్వరగా మార్చేసుకోండి. భోజనం చెయ్యరుగాని. అలా ఫేన్‌కింద కూచోండి వడ్డిస్తాను."

"ఇంట్లో వంటమనిషి ఉన్నా, ఓపిక

లేకపోయినా నీ చేత్తో పెట్టుకుంటేగాని నీకు తోచదుగదా శకూ! నేనంటే నీకింత అభిమానానికి నీకు నే నేంచేశాను ?"

శకుంతలత్త ఏమందో నాకు సరిగా వినబడ లేదు.


'పిల్ల లందరూ పడుకున్నట్టేనా ?'

'ఏం ?'

'ఏంలేదు. ఎన్నాళ్ళకో గాని మళ్ళీ యిలాంటి వెన్నెలరాదు. ఇలా డాబా మీదకు వచ్చి నా ఒళ్ళో పడుకుందుగాని. నీ కిష్టమని మొల్లలు తెచ్చాను. అవి గుచ్చుకుని తలనిండా పెట్టుకుందువుగాని. రసగుల్లాలు కూడా తెచ్చాను. నేను తిని పిస్తూంటే అవి ఒకటీ ఒకటీ తింటూ ఆ చందమామని చూస్తూ నీ బాధ లన్నీ కొన్ని క్షణా లయినా మరచిపోదువు గాని...దా...నా ఒళ్ళోకి రా !'

మంత్రముగ్ధలా శకుంతలత్త వస్తోంది,

'ఎన్నిసార్లు చెప్పినా నీ మీద నీకు శ్రద్ధలేదు — ఆ తలకు రంగు వేసుకోవు. పెట్టెలో మూలుగుతున్న ఆ ప్రింటెడు జార్జెట్లు కట్టుకోవు. నేను ఉద్యోగరీత్యా అనేకమందిని చూస్తాను. 'చక్కనమ్మ చిక్కినా అందమే' అని ఏ పరిస్థితిలో ఉన్నా ఎంత బాగున్నావు నువ్వు! 'చక్కనివారి నెల్ల ఎకసక్కెము లాడెడు చిన్నదాన...' మా మామయ్య ప్రేమో త్పలమాల కొటోలు అందుకున్నాడు. నే నిక చూడలేక తలుపువేసేసుకున్నాను.



ఇన్ని జరిగినా ఏమీ ఎరగనట్టు యిక మా శకుంతలత్త మర్నాడు అంటుంది. 'నేను ఒరుగులా ఉన్నా ఆయన పిడుగులా

ఉన్నా మా మామయ్య ఒక్కసారైనా తప్పటడుగు వెయ్యడు. అదే ఆయనలో గొప్పదనం. ఎందరున్నా నేనే కావాలి ఆయనకి! ఎప్పటికైనా నన్నే వెతుక్కు వస్తారు ఆయన' అన్నీ తెలిసి వీళ్ళిద్దరూ ఇంతలా లోకాన్ని మోసబుచ్చడం దేనికి? నా కింక అక్కడ ఉండబుద్ధి పుట్టలేదు. ఎంత బలవంతపెట్టినా యింక ఆ యింట్లో ఉండలేకపోయాను. అప్పటి కప్పుడు ప్రయాణం కట్టి స్టేషనుకి వచ్చేశాను. నేను వద్దంటున్నా వినక నన్ను దిగబెట్టడానికి వాళ్ళ పెద్దబ్బాయి పదమూడేళ్ళ భాస్కరం స్టేషనుకి వచ్చాడు.

ఈ కుర్రాడి సంగతి ఇదివరకు నే నెరగనిదికాదు. కాని ఆనాటి భాస్కరం ప్రవర్తన నాలోని మాలిన్యాన్నంతటినీ నిమిషాలమీద ఎగరగొట్టేసింది. క్యూలో నిలబడి తనే టిక్కెట్టు తీశాడు. ఎక్కడో నాలుగు ప్లాట్‌ఫారాల అవతల బుక్ స్టాలు ఉంటే అరమైలుదూరం నడిచివెళ్ళి నాకోసం పేపరు తీసుకువచ్చి యిచ్చాడు. మావైపు దొరకవని ఆకుపచ్చని అరటి పళ్ళు ఓ డజను కొని తెచ్చిపెట్టేడు. నన్ను ఒక్కముక్క అడక్కుండా నాకు కావలసినవన్నీ అమర్చిపెట్టేడు. రైలు కదిలింది. రాష్ట్రాలకి రాష్ట్రాలే గడచిపోతున్నాయి. చక్కని బట్టలు చెక్కుచెదరని క్రాపింగుతో అభిమానం ఆప్యాయతా సూచించే కళ్ళతో టాటా చెబుతున్న భాస్కరంగాడు నా స్మృతి పథంలోంచి చెరిగిపోలేదు. వీడేకాదు, పిల్లలంతా నేనక్కడున్న నాలుగు రోజులూ నన్ను గడియ వదల్లేదు. మళ్ళీ ఒస్తానని ఒట్టు వేయించుకోనివాళ్ళు వాళ్ళలో ఒక్కరూ లేరు. ఇంతలా మనుషులకోసం ప్రాకులాడడం, ఒళ్ళు పులకరించే ఆదరాభిమానాల కోసం దేవుళ్ళాడ్డం వీళ్ళకు ఎవరునేర్పారు? మంచి ఎండవేళ ఎయిర్ కండిషన్ రూంలో కూచుని ఐస్‌క్రీమ్ తినే టప్పుడు కలిగే అనుభవం వీళ్ళింట్లో ఎందుకు కలుగుతోంది?

అందుకనే నేను వచ్చేముందు మామయ్యని పక్కగదిలోకి తీసుకెళ్ళి రాత్రి నేను చూసిన దృశ్యం గురించి అడక్కపోలేదు. ఏమాత్రం తొట్రుపడకపోగా మరింత ప్రతిభావంతంగా నవ్వి 'ఓరి రాస్కెల్! నీకంట ఎక్కడ పడిందిరా అది! ఉండు ఆ గుజరాతి గుంటకి దిష్టి తీయించే ఏర్పాట్లు చేయిస్తాను' అన్నాడు. అంతే కాదు. 'కాశ్మీరు కన్యల కనుగీటివచ్చితి, బీహారు యువతుల ప్రేమగొంటి...' అనే సీసం అందుకున్నాడు. అదే కాదట. ప్రేమకు పర్వతాలూ సముద్రాలూ అడ్డు రావుట. తీయని జాతీయ ప్రేమేగాక అందమైన అంతర్జాతీయ ప్రేమ స్థాపించిన పతిత పావనుడు మా మామయ్య...నేను

రెండు చెవులూ మూసేసుకుని ఇవతలి గదిలోకి వచ్చేశాను.

ఇంతటి చంచల చిత్తానికీ — ఆ యింట్లో అంతటి చిత్తశాంతికీ ఎలా సమన్వయం!

నేను ఇంటర్వ్యూకి వెళ్ళడం, నన్ను అక్కడ అడిగిన ప్రశ్నలూ అన్నీ మరచిపోయాను. ఆ రైలులో ఉన్నంతసేపూ నాకు మా మురళీధరం మామయ్య ఊసు తప్ప మరొకటి పట్టనేలేదు. నా ప్రశ్న ఒకటే ఒకటి. నీతికి కట్టుబడి ఉన్న చాలా కుటుంబాల్లో ఒకళ్ళని ఒకరు చెప్పుకోవడం, నొప్పించే మాటలు అనుకోవడం అస్తమానూ దేనికో దానికి కీచులాడుకోవడం యివే నేను చూస్తున్నాను. దానికి వ్యతిరేకమైన మా మామయ్యగారి కుటుంబంలో అంతటి ఆనందం ఎలా నెలకొంది? కృత్రిమత్వంలోంచి సహజత్వం రావడం ఎక్కడేనా ఉంటుందా? చెడిపోవడం చాతకాని వాళ్ళు సుఖపడనేలేరా?

కాదు. ఆ ప్రశ్నకు జవాబు అదికాదు. ఒకరి వ్యక్తిగత జీవితాలు ఆరా తియ్యడానికి గాని విమర్శించడానికి గాని మన కెవరూ అధికారం ఇవ్వలేదు. జీవితం లాగే మనుషుల్ని యథాతథంగా స్వీకరించి ఆనందిస్తేనే సుఖం ఎక్కువ. ఒక కవి రాసిన చక్కని భావగీతం మనం చదివి ఆనందిస్తున్నప్పుడు అతడు యింటి దగ్గర తాగుతాడో తందనాలే ఆడతాడో మనకి అనవసరం. కాని అనవసర విషయాల్లో ఆసక్తి చూపించడమే మనుషులకి పట్టిన మహమ్మారి. అందుకనే ఆ కుటుంబం గురించి నాకు తోచిన రీతిలో మనసుకి జవాబు చెప్పుకుంటే గాని నేను ఉండలేను.

అటో యిద్దర్నీ యిటో యిద్దర్నీ జటపటాలు వేసుకున్నా మా మామయ్య మా అత్తని ఒక క్షణమైనా మరిచిపోడు. అలా భర్త కంట పడినా తనని పూర్తిగా పోల్చుకున్న మా శకుంతలత్త స్త్రీ జాతికి విరుద్ధంగా పూర్తిగా మామయ్యను క్షమించగలదు. ఏమయినా మొగుణ్ణి వీధిలో పెడితే తన సంతానానికే నష్టం అని ఆమెకు స్పష్టంగా తెలుసు. అందుకే ఆ పిల్లలు అన్ని విధాలా అంత ఆరోగ్యంగా పెరుగుతున్నారు. మొత్తం మీద వాళ్ళందరికీ ఒకళ్ళకి ఏదయినా యివ్వడంలో ఎంత ఆనందం లభిస్తుందో తెలుసు. అందుకే తప్పు చేసినా మా మామయ్యని ద్వేషించడం అంత సులువుకాదు

